
# చేజారిన అదృష్టం

లంక అన్నపూర్ణ



**రిక్షాలు వేసుకొని కొత్తవంతెన దగ్గర దిగాం. అక్కడ ఓ ఇరవయ్యేళ్ల కుర్రాడు నాన్నగారిని గుర్తు పట్టి మమ్మలనందరిని ఇంటికి తీసుకు వెళ్లాడు.**

"రండి...రండి ... మీ కోసమే ఎదురు చూస్తున్నాం ఏమే పెళ్ళివాళ్లొచ్చారు కాళ్ళు కడుక్కొనేందుకు నీళ్ళు పట్టుకురా" అన్నాడొకాయన. ఆయన మాటల తీరు, తత్తరపాటు చూస్తే 'పిల్ల' తండ్రి అయి వుంటాడని అనుకొన్నాను.

"అబ్బాయి ఆఫీసు నుంచి వచ్చేసరికి లేట్చైంది అనుకొంటాను" మళ్లీ ఆయనే "అవునండీ; పని తెమల్లేదు" కోశాను

"ఆఫీసు పని. బాధ్యత కదు బాబూ! ముందు పని." కావాలని పొడిగిస్తున్న మాటలకు ఎవరేమని బదులిస్తారు ?

మొత్తం మీద అందరిని పలకరించాడు పిల్ల తల్లి వచ్చి అమ్మని, వొదినని, బాబి గాణ్ణి, చెల్లెల్ని లోపలకు తీసుకుపోయింది వాళ్ల మర్యాద మన్నన నిజంగా చాలా నచ్చింది.

నాలుగు కుర్చీలు, రెండు చాపలు వున్నాయి. నేను, అన్నయ్య నాన్నగారు కూర్చొనేసరికి మూడు కుర్చీలు సరిపోయి నాయి నాలుగో కుర్చీ నాలుగేళ్ల కుర్ర వెదవ లన్నయ్య కొడుకు బుజ్జి ఆక్రమించే శాడు. పిల్ల తండ్రి నిలబడి పోయాడు.

"వెదవా దిగు, పెద్దవాళ్ళు వుండగా"

నాన్న ఏదో అనబోయారు ...

''పోనీలెండి–పిల్లాడు'' అన్నాడాయన.

ఒక చాపమీద అమ్మా, వొదిన చెల్లెలు బాబిగాడు కూర్చున్నారు. రెండో చాప ఖాళీగా వుంది

కొంతసేపు ఆ రోజు పేపరు వార్తల మీద చర్చ మరి కొంతసేపు ఇళ్ల అద్దెల గురించి మరికొంతసేపు పత్రికల గురించి. ఇలా చాలాసేపు అసలు విషయం వొదిలేసి అనవసరమైన చర్చలు. అప్పుడు నాకనిపించింది అసలు పెళ్లిచూపులే బుద్ధి తక్కువని. ఈ సాంప్రదాయం ఎంత మంచిదైనా అనవసరమైన ప్రస్తావనల అడుగున ముఖ్యమైన సంగతులు మరుగున పడతాయి. చూడడానికి వచ్చిన వాళ్లలోనో, పిల్ల తరఫువాళ్లలోనో కొందరు బుద్ధి తక్కువగా మాట్లాడడంవల్ల కుదిరే సంబంధాలు కూడా తప్పిపోతున్నాయి.

చాలాసేపటికి 'పెళ్లికూతురు' వచ్చింది ఎలా వచ్చిందో గుర్తించడానికి వీలులేనంత చురుకుగా వచ్చి కూర్చుంది చాపమీద.

చకితుణ్ణయ్యాను.

ఆ అమ్మాయిని చూడడానికి పెళ్లిచూపులెందుకు ? దాదాపుగా ప్రతి రోజూ బస్సుస్టాపు దగ్గర చూస్తూనే వున్నాను. రెండేళ్లనుంచి నా సుషుప్తిలోనూ, అర్ధ సుషుప్తిలోనూ కదలాడుతున్నది ఆఫీసుకు వెళ్లే టైము, ఆమె కాలేజికి వెళ్లే టైము ఒకటే. ఆ అమ్మాయి పేరు సుజాత. వుమన్స్ కాలేజీలో బియ్యస్సీ రెండవ సంవత్సరం చదువుతోంది. రెండేళ్లనుంచి బస్సుస్టాపుదగ్గర చూస్తూనే వున్నాను. వివిధ కోణాల్లో ఆమె అందాన్ని తనివితీరా చూస్తున్న నాకు ఈపాటి వివరాలు తెలియడం ఆశ్చర్యంకాదు. చాలాసార్లు అనుకొన్నాను. ఆమెను పెళ్లిచేసుకోవడం ఎంతో అదృష్టం వుంటేనేగాని జరుగదని ఒక విధంగా చెప్పాలంటే నాది వన్‌వే ట్రాఫిక్ ప్రేమ. నన్ను తిన్నగా అసలు చూసిందో లేదో తెలియదుగాని నేనెంతగానో ఆరాధించాను, ప్రేమిస్తున్నాను. ఎంతో అందమైన సుజాత నాకట్టెదుట పెళ్లికూతురుగా కూర్చొని వుండడం నా అదృష్టంగా భావించాను

ఈ పెళ్లిళ్ల మార్కెట్టులో నిలబడి, నన్ను పెళ్లాడలేరా, డబ్బు తీసుకొని మా కుటుంబ బాధలు తీర్చలేరా అని ప్రాధేయపడుతున్నట్టు దీనంగా జాలిగావున్న ఆమె చూపులకు చలించిపోయాను.

''ఇల్లు–కాలేజి తప్పితే మా అమ్మాయికి మరొకటి తెలియదండీ'' ఆయన అన్నాడు.

నాకు తెలియకనా. రెండేళ్లనుంచి చూస్తున్నాను. ఆమెను చూడడంలో అవ్యక్తమైన ఆనందం పొందే అనుభూతికి సిగ్గుకూడా విడచినవాడిని. రెండేళ్ల మొత్తంమీద ఆమె నా వంక సరిగా ఒక్కసారేమైనా చూసిందేమో!

''పేరేమిటమ్మా ?'' అమ్మ అడిగింది.

''సుజాత'' తియ్యగా అన్నది.

నాకు తెలుసులే అందామనిపించింది.

''ఏం చదువుతున్నారు ?'' వొదిన ప్రశ్న

''బి.ఎస్సీ సెకండియర్''చక్కగా అంది

నాకు తెలుసు వొదినా చెత్తప్రశ్నలు వెయ్యకు. నాకు తెలియనివి అడుగు అందామనిపించినా అనలేను కదా !

''పాటలేమైనా వొచ్చా ?'' చెల్లెలడిగింది. గుడ్ క్వొశ్చన్.

''మా ఇంట్లో పాటలంటే అందరికీ ఇష్టంలెండి. అందుకని అడిగింది'' నాన్న అన్నారు.

''దాన్దేముంది లెండి. ఏదో కాలక్షేపానికి అదీ అమ్మాయి గొడవచేస్తే సంగీతం ప్రారంభించాం. మూడేళ్లయింది'' ఆయన చెప్పకు పోతున్నాడు.

ఆపవయ్యా నీ సోది. పాడు సుజాతా అందామనుకొన్నా.

సిగ్గుపోతూ 'రాగసుధారస' పానం చేసింది.

ఎంతైనా అయిపోవాలిగా.

సుజాత లేచింది. పోతూ మొహంమీద మల్లెల గుబాళింపు చల్లింది.

అందరం లేచాం. వాళ్లందరు వీడ్కోలు చెప్పారు. వాకిట్లోకి సుజాత కూడా వచ్చింది. వెళ్లిరానా అన్నట్టు చూశాను.

వస్తారుగా అన్నట్టు చిలిపిగా చూసి నవ్వింది.

''చెప్పారు కదా. జాతకం పంపడం మరవకండి'' నాన్న అన్నారు.

జాతకం కలవకేంచేస్తుంది నీ పిచ్చిగాని అనుకొన్నాను.

వీడ్కోలు తీసుకొని బయల్దేరాం. పోతూ సుజాత వంక చూశాను. నేను తప్ప తనను మరెవ్వరూ చూడడం లేదని నిర్ధారించుకొన్న తరవాత నాకు టాటా చెప్పింది.

నడుస్తున్నాం. అమ్మ వెనక్కితిరిగి చూసి ''పిల్ల బంగారు బొమ్మలాగా వుంది'' అంది. ''థాంక్స్'' అనుకొన్నాను.

''సాంప్రదాయం మంచిదే'' నాన్నగారి సర్టిఫికెట్‌కు మెనీథాంక్స్ చెప్పుకొన్నాను లోలోనే.

''పాట బాగా పాడింది కదమ్మా''



చెల్లెలు వున్నమాటన్నందుకు మంచి చీర కొందామని పించింది.

"అన్నీ బాగానే వున్నాయి" అన్నయ్య అన్నాడు.

"టిఫిన్‌లో ఉప్పు ఎక్కువ" వొదినవంక.

"కట్నమే అనుమానం. తప్పిపోతే అందువల్లనే" నాన్న అన్నమాటలకు అసహ్యం కలిగింది.

నేను సూటిగా అడగలేనుకాని మేము చెల్లెలికి ఏ మాత్రం కట్నం ఇవ్వగలం? ఇవ్వలేని వాళ్ళకి పుచ్చుకొనే హక్కు ఎక్కడ వుందో ?

ఇంటికి చేరుకొన్నాం. చూచాయగానే అయినా స్పష్టంగా చెప్పాను. ఈ సంబంధం నాకు ఇష్టమేనని నాన్న అన్నయ్యలు అంత తేజస్సుగా లేరు వాళ్ళకు కట్నం దగ్గర పట్టింపు వుంటుందని తెలుసు. ఎందుకనంటే ఇదివరకు కొన్ని సంబంధాలు కుదిరినట్టే కుదిరి, కట్నం వచ్చేక జాతకం కుదరలేదన్న పేరుతో తప్పిపోయినాయి.

ఇంట్లో కోడలితో సర్దుకు పోవలసి వదాన్ని నేను సాంప్రదాయం, బుద్ధీ అదీ చూడండంటుంది అమ్మ ఏమైనా అమ్మ ఇన్‌ఫ్లుయన్స్ పనిచెయ్యదు.

ఆ రాత్రి నిద్ర పట్టలేదు. ఓ రాత్రివేళ చెల్లెలు వచ్చింది.

"పడుకోలేదురా?" అడిగింది.

"నిద్ర పట్టడం లేదు"

"నీకే ఇలా వుంటే కాబోయే వొదినకు ఎలా వుంటుంది చెప్పు?"

"ఎలా వుంటుంది?"చెప్పగలిగితే సమాధానం విందామన్న సరదాతో అడిగాను.

"ఏమో! నే నెన్ని నిద్రపట్టని రాత్రులు గడిపానో మీకెలా తెలుసు?"

చీకటిలో ఛెళ్ళున కొట్టినట్టయింది. ఉలిక్కి పడ్డాను

"అంటే ప్రతి సంబంధం కుదిరితే బాగుండు ననుకోవడం... కట్నం దగ్గిర చెడిపోవడం.... ప్రతి వేధవా ఇంతే."

మళ్ళీ మరో దెబ్బ.

"నువ్వనేదేమిటి?" అడిగాను.

"నేనూ అదే అడగాలని వచ్చాను.ఇంతకీ నీకు సంబంధం నచ్చలేదా?"

"చెప్పానుగా. నేనీ సంబంధం తప్పితే మరొకటి చేసుకోను" స్పష్టంగా చెప్పాను.

# చేజారిన అదృష్టం

"అన్నమాటమీద నిలబడు. నాన్న, అన్నయ్య కట్నం గట్రా అని పేచీ పెడతారేమో. నువ్వు మాత్రం తలొంచకు. ఏం? కట్నం లేకుండా చేసుకోలేవా?"

అదిరిపోయాను. చీకటో చెల్లెలు కవళికలు ఎలావున్నాయో గమనించలేకపోయాను. దానికి కూడా ఇన్ని ఊహలు, ఇంత చురుకైన ఆలోచనలు వున్నాయని ఎన్నడూ అనుకోలేదు.

"ఇప్పుడు చెప్పనా ఆ అమ్మాయి, ఏమనుకుంటూ వుంటుందో — సరిగ్గా ఇంత అర్ధరాత్రివేళ ఈ సంబంధం కుదరాలనీ,

## గాజు బొమ్మ

నడుస్తుంది పలుకుతుంది
నవ్విస్తే నవ్వుతుంది
పరిమళాల కెరటాలకు
పరవశించి ఆడుతుంది

పువ్వువెనుక ముల్లుందని
నవ్వువెనుక కుళ్ళుందని
మంచితనం ముసుగు వెనుక
వంచన మాటేసిందని

తెలిసినపుడు గాజు మనసు
నిలువెల్లా పగులుతుంది.

— కేఎస్వీ

కట్నం కానుకల ప్రస్తావన రాకుండావుంటే బాగుంటుందని అనుకొంటూ వుంటుంది. ఇవి ఎక్కడ సమస్య అయి తప్పిపోతుందో— మార్కెట్టులో ఎంతకాలం నిలబడాలోనన్న భయంతో ఆలోచిస్తూ వుంటుంది. నాలాగానే" చెల్లెలిగొంతు జీరబోయింది.

ఇక వుండబట్టలేకపోయాడు.

"నీలాగా ప్రతి ఆడపిల్ల..." ఏదో అనబోయాను.

'ఛీ—ఛీ !!' అలా అనకు. అలా చీకట్లో ఎందరు చెల్లెళ్ళు ఆవేదన పడుతున్నారో" అన్నది.

చెల్లెలికి హామీ ఇచ్చాను. ఆ రాత్రి గడచింది.

తెల్లారి కాఫీలదగ్గర ప్రసక్తి వచ్చింది వాళ్ళు కట్నం ఏమీ ఇవ్వలేనివాళ్ళని నాన్న అన్నారు.

"ఇవ్వలేకపోతేం ఏం ?" అడిగినందుకు చెల్లెలు ముఖంలో తృప్తి కనిపించింది.

"మరి చెల్లెలిపెళ్ళి ఎలా చేదామనుకొంటున్నావు ?" అన్నయ్య అడగిన ప్రశ్నను చాలా నిరసించాను

సంభాషణ అంతా తీవ్రస్థాయిలోనే జరిగింది. మొత్తంమీద ఇంట్లో అందరు మంచి పట్టుదలమీదే ఉన్నారు. ఈ సంబంధం కుదిరే లక్షణాలేమీ కనిపించలేదు.

ఆ పూటకు చర్చ ముగిసింది. రోజుటికంటె ఉత్సాహంగా ఆఫీసుకు బయలుదేరాను. సుజాతతో మాట్లాడ వలసింది వుంది. మాట్లాడే అవకాశం ఎప్పుడూ వుంది గాని హక్కులేదు. ఏది ఏమైనా ఆమెనే చేసుకొని తీరాలని నిర్ణయించుకొన్న నాకు ఆమెతో మాట్లాడే హక్కు కూడా లభించింది.

బస్సుస్టాపు దగ్గర సుజాత కనిపించలేదు. హతాశుణ్ణి అయ్యాను. ఆ రాత్రి మళ్ళీ చెల్లెలు చెప్పింది ఆ అమ్మాయిని కలుసుకొన్నానని, సెకండియర్ పరీక్షలు పెళ్ళిచూపులతోనే అయిపోయాయి. అందువల్ల ఆమె కాలేజికి పోలేదు. నేనంటే సుజాత కూడా చాలా ఇష్టపడుతున్నట్టు చెల్లెలు చెప్పింది.

* * *

క్యాంపునుంచి నాలుగు రోజులు తరవాత ఆఫీసుకు వెళ్ళాను. టేబిల్‌మీద కవరు వుంది. అది సుజాత వ్రాసింది. సంబోధన లేదు ఇలావుంది.

"నమస్కారం. నన్ను గుర్తించగలిగరనుకొంటాను. మీ చెల్లెలు ద్వారా మీ మనస్సు తెలుసుకొన్నాను. అదృష్టవంతురాలిని. నేనేమి మీకు ఇవ్వగలను? మీతో ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి. ఎలా కలుసుకోగలను ?—ఎస్"

ఎన్నోసార్లు చదువుకున్నాను ఆనందంగా.

ఇంటికి వెళ్లాను అందరు ముబావంగా వున్నారు చెల్లెలు గంభీరంగా వుంది. నేనే సైలెన్స్ బ్రేక్‌చేశాను.

"వాళ్ళనుంచి కబురేమైనా వచ్చిందా?"

"ఎవరి నుంచి ?" అర్ధం కానట్టు అడిగారు నాన్న.

"అదే—మొన్న సంబంధం."

"అదా జాతకాలు కుదరలేదు"



కటువుగా అన్నారు

"ఎందుకని?" కసిగా అడిగాను.

"ఎందుకేమిటి? కుదరలేదు, అంతే! చేసుకొంటే తర్వాత గండం"

ఇచ్చి పడదామని అనుకున్నాను. గొంతులోనే ఆగిపోయింది ఆవేశం

"ఈ సంబంధం కుదరదని కూడా జాతకంలోనే వుందేమో కనుక్కున్నారా?" వెటకారంగా అన్నాను.

"అప్పుడే నీ తెలివితేటలు" అన్నయ్య అన్నాడు.

పుండుమీద పుల్ల పొడుచుకున్నట్టయింది అన్నయ్య మాటలలో.

"నీకు అనవసరం. ఇది నా సొంత విషయం" కత్తులు ఝుళిపించినట్టు అన్నాను.

"నాన్నా నీ కొడుకు ప్రతాపం. కాని మునుపే ఇలా వున్నాడు. అయిన తరవాత ఎలా వుంటాడో. మన బతుకులు ఎలా తెల్లారతాయో!"

మొత్తంమీద ఇంట్లో ప్రశాంతత పోయింది

"ఒకరు చెబుతున్నా ఈ సంబంధం మాకు ఇష్టంలేదు. చేసుకోదలచావో నీకూ మాకూ ఏమీ సంబంధం వుండదు." ఖరాఖండిగా చెప్పేశారు నాన్న

వాళ్ళ నిర్ణయం వాళ్ళు చెప్పారు. ఇహ తేల్చుకోవలసింది నేనే. వాళ్ళ పట్టుదల వాళ్ళకి వుంటే నాకు మాత్రం పట్టుదల లేదా?

# చేజారిన అదృష్టం

మారు మాట్లాడకుండా ఇంట్లోంచి బయటకు నడిచాను. ముందే నిర్ణయించుకొన్నవాడిని కనుక ఎక్కువ ఆలోచన అక్కరలేకపోయింది. నా పెళ్ళికి నేనే పెద్దను. సుజాత వాళ్ళింటికి బయలుదేరాను

వాకిట్లో సుజాత అన్నయ్య కనిపించాడు. నన్ను చూసి పలకరించకుండా లోపలికి వెళ్ళాడు. గడపలోనే నిలబడ్డాను – ఏమని పిలవాలో, ఎవరిని పిలవాలో తెలియలేదు. కొంతసేపటికి సుజాత తండ్రి వొచ్చాడు. వస్తూనే నా మీద దాడి ప్రారంభించాడు.

"ఏం నాయనా ఇలావొచ్చావ్? జాతకాలు కలిసినాయా? ఇస్తామన్న కట్నం నచ్చిందా? మా సాంప్రదాయం మంచిది కాదా? ఏం వంకలు ఇంకా పెడదామని వచ్చావ్?" ఏమిటో అంటున్నాడు. ఈ అనవసరమైన ప్రస్తావన లెందుకు వచ్చినాయో అర్థం కావటంలేదు ఆయన ప్రశాంతంగావుంటే నేనేమైనా చెప్పగలను.

అయిదు రోజుల క్రితం ఆయనలో కనిపించిన మంచితనం, ప్రశాంతత, కలుపుగోలుతనం ఏమైనాయి? ఇంత ఆవేశమేమిటి? మంచితనమంతా తెచ్చిపెట్టుకొన్నదేనా?

బ్రేకు వెయ్యకపోతే ఈ ధోరణి ఆగదని నిర్ణయించుకొన్నాను.

"నేను చెప్పేదికూడా వింటారా?" ప్రారంభించాను. కాని, అంతలోనే గయ్యిమని ఆయన భార్య ఇంట్లోంచి విరుచుకు పడింది.

"ఏమిటయ్యా నువ్వు చెప్పేది? మేం వినేది? ఆ తండ్రి చెప్పాడు ఇహ ఈ కొడుకు చెబుతాడు..." ఏమిటో ప్రేలాపన ప్రారంభించింది. మొత్తంమీద అనాగరికమైన మనిషి. ఈవిడ అత్తగారైతే అబ్బాయి పరిస్థితి కష్టమే. రోడ్డుమీద అలగాజనం గుర్తుకువచ్చింది వీళ్ళని చూస్తే. ఆ రోజు పెళ్ళిచూపుల్లో ఆవిడ చూపిన మర్యాద మన్నన అంతా నటనే. అసలు స్వరూపం ఇది.

ఐనా తమాయించుకొన్నాను. నేను చేసుకొనేది సుజాతని. వీళ్ళనికాదు. కొంచెం ఘాటుగానే డోసు ఇవ్వాలనుకొన్నాను.

"ఇంటికి వచ్చిన మనిషి ఎందుకు వచ్చాడో తెలుసుకోకుండా ఇలా మాట్లాడడం ఏమీ బాగాలేదు." గట్టిగానే అన్నాను.

"ఇంటికి వచ్చిన పెద్దమనిషితో ఎలా ప్రవర్తించాలో, ఎలా మాట్లాడాలో మీ దగ్గరే నేర్చుకోవాలి. మీ మర్యాదలకు చాలా థాంక్స్" సుజాత అన్నయ్య అన్న మాటల వెనుక అంతరార్థం అర్థమైంది నేను వూళ్ళోలేని నాలుగురోజుల్లో ఏమి జరిగిందో ఊహించాను. సుజాత తండ్రి ఇంటికి వచ్చి వుంటాడు. ఆయనతో కావాలనే మర్యాదగా ప్రవర్తించి వుండరు

సుజాత అన్నయ్య అన్న మాటలకు సమాధానం చెబుదామనిపించింది. నాకు ఆ ఇంట్లో ఎవరూ అక్కరలేదు కావలసింది ఆమె అందుకే వాళ్ళ సభ్యతా రాహిత్య ధోరణిని కూడా లెక్క చేయలేదు కనీసం కూర్చోమని అని కూడా అననందుకు చికాకు కలిగింది.

"మీరు కూర్చోమనకపోయినా కూర్చుంటున్నాను" అన్నాను అక్కడేవున్న కుర్చీని దగ్గరకు లాక్కొని.

ఎక్కడ నుంచి వచ్చిందో సుజాత గాలి దుమారంలా.

"ఏ మొహంపెట్టుకొని వొచ్చారిక్కడికి. మాకు సిగ్గు, అభిమానం, పరువు ప్రతిష్ఠ వున్నాయి. ఇష్టంలేకపోతే ఇష్టంలేదని చెప్పవచ్చు. ఒకళ్ళమీద అభాండాలు వేయడం మంచిది కాదన్న జ్ఞానం లేకపోతే తెచ్చుకోండి. ఒక సంగతి తెలుసుకోండి. ఆడపిల్లను కన్న తండ్రి నానాగడ్డి కరవక తప్పదు. మీకు కూడా చెల్లెలున్నదన్న సంగతి ...' ఆమె మాటల ధోరణి అసహ్యంగా వుంది. చాలా సంస్కారహీనంగా మాట్లాడుతున్నది రోజా కూరగాయల మార్కెట్టులో కూరలమ్మే అమ్మాయి చేతులు తిప్పుకొంటూ పోట్లాడిన దృశ్యం కళ్ళెదుట కనిపించింది. ఇంత అనాగరికమైన మనిషిని చేసుకొంటే బతుకెలా వుంటుందో ఊహించుకోగలను. అందమైన రూపం వెనుక కురూప స్వభావం. ఛీ–! ఇంట్లో అందరిని మన్నించాను. సుజాత అందరి కంటె ఒక ఆకు ఎక్కువే తిన్నది. అక్కడ వుండలేకపోయాను. ఇంటికి చేరాను

ఇంకో సంబంధం చూడండని నాన్నగారికి చెప్పాను.